కథ

# చిట్టచివరి స్నేహితుడు

కూతురు ఆఫీసు పని ముగించుకుని ఇంటికి చేరేసరికి ముసలాయన వంటగది బాల్కనీలో వున్నాడు. ఫేము కుర్చీలో ముందకు వంగి కూర్చుని, చేతులు రెయిలింగ్‌కు చాచి, వీధిలోకి ఏటవాలుగా తొంగి చూస్తున్నాడు. సాయంత్రపు ఎండలో ఆయన ముగ్గుబుట్ట జుట్టు అక్కడక్కడా పసుపు ఛాయతో మెరుస్తోంది.

ఆమె హేండ్‌బాగ్ డైనింగ్‌ఛైర్‌కు వేలాడేసి వంటగదిలోకి నడిచింది. ఫ్రిజ్‌లోంచి నీళ్ళబాటిల్ తీస్తూ అడిగింది. ''ఏంటి నాన్నా ఎండలో కూర్చున్నావ్?''

వినికిడి సన్నగిల్లిన ఆయన చెవులకు ఏదో అలికిడైనట్టనిపించింది తప్ప ప్రశ్న వినపడలేదు; మూలవాటుగా తల తిప్పి ''వచ్చావా'' అంటూ తలపంకించి యథాప్రకారం వీధివైపు చూపు మరల్చాడు.

ఆమె ''హ్మ్!'' అని నిట్టూర్చి, బాటిల్ తీసుకుని బాల్కనీలోకి నడిచింది. ఆమెకు యాభైనాలుగేళ్ళు. అన్నేళ్ళ జీవితాన్ని చూసిన అలసట ఆమె కళ్ళకింద నలిగిన చర్మపు సంచీల్లో స్ఫుటమౌతోంది. మధ్యకి తీసిన పాపిట మొగలో ఓ తెల్లని సిగపాయ బయల్దేరి చెవి వెనక కలిసిపోయింది. నీళ్ళు తాగడానికి చుబుకం పైకెత్తినా ఇంకా డబుల్‌చిన్ కనిపిస్తూనే ఉంది. నాలుగు గుక్కలు తాగిన తర్వాత బాటిల్ రెయిలింగ్‌మీద ఆన్చి, మూత బిగిస్తూ, ముసలాయన్ని ఉద్దేశించి ఇందాకటి ప్రశ్నే మరలా రెట్టించింది.

ఈసారి వినిపించిందేమో; ముసలాయన వీధి మొగ మీంచి ఆమె వైపుకు, ఆమెమీంచి అటుపక్కన ఆకాశంలో వున్న సూర్యునివైపుకు తలతిప్పి చూశాడు. మరలా మునుపటిలా వీధి మొగవైపుకు చూపు మరలుస్తూ సమా ధానమిచ్చాడు. ''ఎండేముందమ్మా... ఐదయిపోయింది కదా. చల్లబడిందిలే కాస్త'' ఇలా అంటూనే చెమటవల్ల మెడకంటుకుపోయిన లాల్చీ కాలర్‌ను చీదరగా వదులు చేసుకున్నాడు.

ఆమె చిన్నగా నవ్వింది. పై పెదవిపై మీసం కట్టిన చిరుచెమట మెరిసింది. తనూ ఆయన చూస్తున్న వైపే చూపుసారిస్తూ, ''ఏంటి అంత దీక్షగా చూస్తున్నావ్?'' అని అడిగింది.

ఆయన అదే ప్రశ్న కోసం ఎదురుచూస్తున్నట్టు, కుర్చీలో భారంగా వెనక్కు వాలాడు. ''ఈ కుర్రాడమ్మా..., ఇంకా రాలేదు. రోజూ పొద్దున్న నువ్వు ఆఫీసుకు వెళ్తున్నా వనగా వచ్చేవాడు కదూ! ఇవాళేంటో మరి! సాయంత్ర మైంది. పత్తాలేడు'' ఫిర్యాదు చేస్తున్నట్టు చెప్పాడు.

''ఓహ్ శేఖర్ కోసమా!'' అందామె ఏదో గుర్తొచ్చినట్టు; ''మర్చిపోయాన్నానా చెప్పడం. శేఖర్ ఇవ్వాళ సాయంత్రంజేసి వస్తానన్నాడు. సామాను సర్దుకోవాలట. రేపొద్దున్న వాళ్ళ ఊరెళ్ళిపోతున్నాడు. ఇవాళొచ్చి చివరి జీతం తీసుకుంటానన్నాడు...'' ఈ సంగతి చెప్తూ చెప్తూ కింద గేటుమీదుగా వెళ్తున్న కూరగాయల బండివాణ్ణి చూసింది. ''బాబూ కూరగాయలూ!'' అంటూ కేకేసింది. అతను పైకి చూడగానే చేతితో ఆగమని సైగచేసి, ''నాన్నా కిందకి వెళ్తున్నా. నువ్వూ లోపలికి వచ్చేసేయ్. ఎండ మొహానికి కొట్టడంలేదూ!'' అంటూ లోపలికి వెళ్ళింది.

ముసలాయన చూపుఇంకా కూతురు వదిలి వెళ్ళిన శూన్యంలోనే వుంది. లిప్తమాత్రంలో తేరుకుని, ''మరి నాకు చెప్పాడు కాదేం?'' అంటూ ఆమె వెళ్ళినవైపు శక్తి కొద్దీ అరిచాడు.

''ఎవరూ, శేఖరా? చెప్పేవుంటాడు. నీకు వినపడి వుండదు'' క్రమంగా కృశిస్తున్న గొంతు హాల్లోంచి జవాబిచ్చింది. కాని అది ఆయనకు వినపడలేదు.

క్షణాల్లో పదేళ్ళు పైబడినట్టు అయిపోయింది ఆయన వాలకం. రెయిలింగ్ ఆసరాతో నెమ్మదిగా కుర్చీలోంచి లేచాడు. ఆయనకు ఎనభయ్యేడేళ్ళు.

ఫణికుమార్

## నా మనసంటే నేనే

నా మనసు ఇవాళ మౌనంగా లేదు.
మాట్లాడుతూనే ఉన్నది.
కాసేపు విరామం తీసుకో అంటే వినదు.
ఇంతకూ ఆ మాటలు దేని గురించి?
దినపత్రికలు
పుటలకొద్దీ వెదజల్లే రంగురంగుల వార్తల గురించి
ఒక్కొక్క వార్తలోని నిజానిజాల ఆంతర్యం గురించి
తళతళా వెలిగిపోయే వాటి నీలినీడల గురించి.
విసుగెత్తి నేను నా మనసును ఊరుకో అని గద్దించి
చూశాను.
అలా దాని నోరు మూసేయాలనుకున్నాను.
అది గమనించి తల విదిలించింది మనసు
ఏమాత్రం వీల్లేదన్నట్టు.
దాని పెదవుల మీద చెయ్యి పెట్టి బుజ్జగించాలని
ప్రయత్నించాను.
ఈ అదిలింపులూ అనునయాలూ తనమీద
పనిచేయవని
నా ముఖంమీదే అనేసింది నా మనసు.
ఇంకా అది తన విసర్గ పర్వం ఇలా
కొనసాగించింది.
''ఎన్నికల రుతువు రాగానే
ఏమిటండీ ఈ రాజకీయాల రంగుల హోలీ.
ఐతే ఇవి నిలిచే రంగులా కావు
ఆ పూట దాటగానే నీరుగారిపోయి
కంపు కొట్టేవి.
అబ్బో ఎందరెందరు వాగ్దాన కర్ణులని.
ఎప్పటికప్పుడు వారి నోట వర్షించే మాటలు
తమ పబ్బం గడుపుకోగానే తుస్సుమనే
గాలి మూటలు.
ఎలా భరించేది ఈ కుహనా నటుల
అనేక పాత్రాభినయాలను.
ఒక్కొక్క దాని చిట్టా విప్పి ఏకరువు పెట్టాలను
కున్నాను.
విప్పవలసిన ముడులింకా ఎన్నో వున్నాయి.
మీకు ఇబ్బందిగా ఉన్నట్టుంది
మీ తృప్తికోసం ప్రస్తుతానికి విరమిస్తున్నాను.
నా సహనం పట్టు తప్పినప్పుడు
మళ్ళీ రంగంలోకి వస్తాను.
ఇప్పటికి సెలవా మరి''
అలా అని నా మనసు విరమించుకున్నదంటే
వ్యక్తిత్వ మూల్యాల పరిరక్షణకు
నిత్యం తహతహలాడే నాలోని నేనే.

డా॥ సి.నారాయణరెడ్డి

అవసరానికి మించిన చర్మాన్ని అస్థిపంజరంపై వదులుగా ఆరేసినట్టు ముడతలతో బక్కగా బలహీనంగా వున్నాడు. పళ్ళులేని చప్పిడి దవళ్ళు ఏదో నవుల్తున్నట్టు కదుల్తు న్నాయి. నీలం గంళ లుంగీమీదకు తెల్లని లాల్చీ తొడు క్కున్నాడు. లుంగీ కింద నుంచి ఎడమ పాదానికున్న సిమెంట్‌కట్టు కనిపిస్తోంది. ఆ కాలిమీద వీలయినంత తక్కువ బరువు మోపుతూ కుంటినడకతో లోపలికి బయల్దేరాడు.

యుగాలనిపించిన కొన్ని క్షణాల పర్యంతం వంట గదిని దాటి, డైనింగ్ టేబిల్ దగ్గరకు చేరుకున్నాడు. కుర్చీ వీపుకు తగిలించి వున్న హేండ్‌బాగ్‌ని తీసి, ''ఎక్కడ పడితే అక్కడే పడేస్తుంది'' అని గొణుక్కుంటూ పక్కన గోడ కున్న హేంగర్‌కి తగిలించాడు. ఫేన్ స్విచ్ నొక్కాడు. కరెంట్ లేదు. నిట్టూర్చి కుర్చీ లాక్కుని నింపాదిగా కూర్చున్నాడు. డైనింగ్ టేబిల్‌మీద రెండు చేతులూ ఊతంగా నిలబెట్టి మధ్యలో ముఖం ఆన్చి ఆలోచనలో నిమగ్నమయ్యాడు. చీకట్లో ఫ్లాట్‌ఫాలం అంచు దగ్గర నిలుచున్నపుడు ఎదుట వెళ్తున్న రైలు కిటికీల్లోంచి క్షణానికొకటిగా మారుతూ కనిపించే దృశ్యాల్లా, ఆయన మనోనేత్రం ముందు ఇటీవలి గతానికి చెందిన కొన్ని దృశ్యాలు చకచకా కదలసాగాయి.

వాటన్నింటిలోనూ శేఖర్ వున్నాడు. కొన్నింటిలో అస్పష్టంగా తను కూడా వున్నాడు. ఒక దృశ్యంలో శేఖర్ మంచంపై తన కాళ్ళ దగ్గర కూర్చుని వార్తాపత్రిక సంపాద కీయం గట్టిగా చదివి వినిపిస్తున్నాడు; ఒక చోట విసిగిస్తున్న తన దవడలు బలవంతంగా విప్పదీసి టానిక్ చెంచా నోట్లో ఇరికించడానికి ప్రయత్నిస్తున్నాడు. ఇంకొకచోట తనకు సవ్యంగా వినిపించేట్టు బిగ్గరగా మాట్లాడుతూ, ఆ గొంతుకు తగ్గ అంగికంతో చేతులూపుతున్నాడు. మరొక ఓట, తాము కూర్చున్న పార్కు బెంచీ ముందు

నుంచీ వాళ్ళ నాన్నతో పాటూ బుడి బుడి అడుగుల్తో జాగింగ్ చేస్తున్న పసిదాని తోవకి వూతకర్ర అడ్డంపెట్టి నవ్వుతున్నాడు; ఇంకో దృశ్యంలో బయట కారిడార్‌లో లిఫ్టుదగ్గర నుంచొని, బటన్ నొక్కి, తన వైపు వీడ్కోలు సూచకంగా చేయి ఊపుతున్నాడు.

ముసలాయన తల విదిల్చి ఈ స్మృతులనించి తెప్పరిల్లాడు. కుర్చీలో వెనక్కి జారగిలబడ్డాడు. ఆయనకి పరిసరాలు వుక్కపోతగా అనిపించాయి. డైనింగ్ టేబిల్ మధ్య స్టాండుమీద బోర్లించిన గాజు గ్లాసుల్ని ఒక్కొక్కటే తీసి గోడకేసి బద్దలు గొట్టాలనిపించింది. ఇంతలో తలుపు తెరుచుకుని కూతురు గుమ్మంలో ప్రత్యక్షమైంది. ఆమె చంకలోంచి ముందుకులాగి పట్టుకున్న కొంగు నిండా ఏవో కూరగాయల బరువుంది. వస్తూన్నదల్లా తండ్రిని చూడగానే గడపదగ్గర ఆగి, సందడిగా నవ్వుతూ బయటికి తొంగిచూసి, "రా శేఖరూ! ఇదిగో, పొద్దుట్నించీ నాన్న నీకోసం వెయిటింగు" అంటూ లోపలికి వచ్చింది; వంటగదిలోకి వెళ్తూ "కింద కూరగాయలు బేరమాడుతూంటే ఎదురొచ్చాడు నాన్నా" అంటూ తండ్రికి వివరమందించింది. ముసలాయన చూపు అప్పుడే లోనికి ప్రవేశించిన శేఖర్‌మీద వుంది.

గుమ్మంపక్కనున్న జోళ్ళ స్టాండులో జోళ్ళు విదులుస్తూ, "ఏం తాతగారూ, నా కోసం చూస్తున్నారా?" అంటూ ముసలాయనకు ఎడంగా వున్న డైనింగ్ కుర్చీలో కూర్చున్నాడు. అతనికి ఇరవైమూడేళ్ళు. తల్లుల పోలిక రావడంవల్ల సున్నితమైన అందాన్ని సంతరించుకును ముఖాల కోవకు చెందుతుంది అతని ముఖసౌష్టవం. కిందాపైనా బరువైన కనుపాపల్తో నవ్వితే చికిలించుకునే కళ్ళు, దట్టమైన కనుబొమ్మలు, కణతల్ని కప్పేసి, వెనక్కి దువ్విన దుబ్బు జుట్టు; నూనూగు మీసాలు; వెడల్పాటి కింది పెదవి; గోధుమరంగు శరీరం...

"ఏంటి కొడతారా, అలా చూస్తున్నారు?" భయంగా మొహంపెట్టి అడిగాడు శేఖర్.

ముసలాయన ముభావంగా చూపులు గ్లాసు స్టాండు వైపు మళ్ళించాడు.

"నాన్నా! వచ్చాడు కదా... బయల్దేరండిక పార్కుకి, మళ్ళా చీకటి పడుతుంది" వంటగదిలోంచి గిన్నెల మోత నేపథ్యంగా కూతురి గొంతు వినిపించింది.

ముసలాయనకి అదను దొరికినట్టైంది; కుర్చీలోంచి లేచి, "నీరసంగా వుందమ్మా, కాస్త నడుం వాలుస్తాను" అంటూ తన పడగ్గది వైపు నడిచాడు.

"అయ్యో! అదేంటి నాన్నా... ఇప్పటిదాకా ఎండనపడి

## మా నాన్న!

నాకు తెలిసిన మా నాన్న
ఎముకలు అరిగేవరకూ
పేగులు ఎండేవరకూ
మెదడు మొరాయించినవరకూ
రుణం తీర్చుకున్నాడు
ఆకలితో పరలోకంలోకి
అతను కట్టిన ప్రయాణం
నాకు ఖచ్చితంగా శాపనార్థం
నిముషాల్లో మీటింగులు చేశారు
ఈటింగులు జరిగేయి
పిత్రార్జితాలమీద
కష్టార్జితాలమీద
తర్జనబర్జనలయ్యేయి
పంచనామాలు జరిగేయి
అతను తన ఆడకూతుళ్ళకు
ఇచ్చిన పసుపు కుంకుమలు చెల్లవన్నారు
శివయాత్రకూడా
సంతృప్తిగా జరగలేదు
ఇరుగుపొరుగులు ముక్కున
వేలేసుకున్నారు
మా నాన్న శవం అగ్నికి జడవలేదు
సమిధగా మరేకకూడా
నాకు హితబోధ చేస్తున్నట్టే వుందే
సందర్భాన్ని మౌనంగా ఎదుర్కోమన్నాడు
ఇంటిపేరు మంట కలపొద్దన్నాడు
అతన్ని ఎవరేమన్నా నా పిడికిళ్ళు బిగిసుకునేవిస
పొలం పసిడి వాటాలయ్యేయి
అతను నాకిచ్చిన ఆస్తి
సంస్కారం సంస్కారం
విశ్వమంత ఎదిగిన సంస్కారం!

గుడిమెట్ల గోపాలకృష్ణ

## మన మానస పుత్రిక

పత్రిక
మన మాస పత్రిక
మనసుదోచే రసరమ్య మాసపత్రిక
మన పత్రిక
కొంటె బొమ్మల, కంటికింపైన
'బాపు' ముఖచిత్ర రచన
కథలు, కవితలతో
మనసు రంజింపచేసే
మన పత్రిక
రసరమ్య మాస పత్రిక
మన మాస పత్రిక, మన మానస పుత్రిక
చిట్టి పొట్టికవితలతో
'సభాపర్వం'తో, 'సమీక్ష'లతో
పత్రిక
మనమాస పత్రిక
మూల్యం చిన్నదైన
అమూల్యమైన పదసంపదతో
సాహితి ప్రియుల
మనసు దోచే పత్రిక
మన మాస పత్రిక
రసమర్య మాత్రిక
మన పత్రిక

ఎస్. రమేష్‌బాబు

కూర్చుని మరీ ఎదురు చూసి తీరా అతనొచ్చాక పడు కుంటానంటారేమిటి?'' అంది కూతురు.

''పోనీలెండాంటీ, పడుకోనీయండి. ఎండలో కూర్చు న్నారా? అందుకే అయ్యుంటుందీ నీరసం'' అన్నాడు శేఖర్, పడగ్గదిలోకి వెళ్తూన్న ముసలాయన్ని చూస్తూ.

ముసలాయనకి శేఖర్ ఆటకట్టించగల మాటేదీ తట్ట లేదు. దాంతో, దానికి బదులుగా, తలుపు దఢాలున శబ్దం వచ్చేట్టు మూసి లోపలికొచ్చేశాడు. కిటికీని కప్పి వుంచిన సిల్కు తెరలు అసలే క్షీణిస్తున్న సాయంత్రపు వెలుగుని మరింత మసకగా లోపలికి వడగడుతున్నాయి. ముసలాయన మంచం హెడ్‌బోర్డుకు తలగడ నిలువుగా వత్తిపెట్టి దానిమీద ఏటవాలుగా జారగిలబడ్డాడు. ఎదురుగా గోడకున్న గడియారంవైపు చూశాడు. టైము సరిగ్గా ఐదున్నర అయింది. తర్వాతిక చేసేదేంలేక, ఆ గడియారాన్నే చూస్తూ కూర్చున్నాడు. క్రమేణా ఆయన చర్మచక్షువులు అంతర్ముఖమై ముందున్న గడియారం మసకబారింది; ఆ స్థానంలో, పక్కనే టౌన్‌షిప్‌లో వున్న ''సీనియర్ సిటిజన్ క్లబ్'' దృశ్యం వచ్చి చేరింది.

అక్కడ జరిగే లాఫింగ్ సెషన్స్ గుర్తు రాగానే ముస లాయన ముఖం చేదు తిన్నట్టు చిట్లింది. రేపణ్ణించీ అక్కడికెళ్ళాలేమో! కానీ తనకు చీదర. అక్కడంతా పాసిపోయిన వాతావరణం. వర్తమానంలేదు. భవిష్యత్తన్న మాటే రాదు.ఎప్పుడు చావొచ్చి వీపు చరుస్తుందోనన్న భయాన్ని, లేక ఇంకా వచ్చి చావదేమన్న ఒంటరితనపు వైరాగ్యాన్నీ తాత్కాలికంగానైనా దిగమింగడానికి అందరూ చెట్టపట్టాలేసుకుని గతాభిముఖంగా నిలబడి ఉన్మాదుల్లా పగలబడి నవ్వుతారు. సంభాషణలన్నీ వాతావరణ వివరాల్తోనో, పిల్లల ఆగడాల్తోనో, రోగాల బేరీజుల్తోనో, కాస్త రంగు పులిమి గతంలోంచి ఎత్తుకొచ్చిన పిట్ట కథల్తోనో నిండివుంటాయి.

ఎవరి ప్రత్యేక వ్యక్తిత్వాల్ని వాళ్ళు విసర్జించేసి, ఏదో ఓడమునిగితే దీవికి ఈదుకుంటూ చేరిన ప్రమాద బాధితుల్లాగా ఒకరినొకరు పిరికిగా కరచుకుపోవడం... ముసలాయన తల అడ్డంగా విదిలించాడు. కళ్ళముందు గడియారం మళ్ళీ రూపం తొడుక్కుంది. టైం ఐదూ-ముప్పయ్యైదయింది. తలుపు తెరుచుకుంది. శేఖర్ బయటే లెక్కపెట్టుకున్న డబ్బు జీన్స్‌పాంట్ ముందు జేబులో కుక్కుకుంటూ వచ్చి, మంచంమీద ముసలా యన కాళ్ళదగ్గర కూర్చున్నాడు.

ఇద్దరూ ఒకరినొకరు చూసుకున్నారు. ముసలాయన వెంటనే గడియారం కేసి తల తిప్పేసుకున్నాడు. శేఖర్ ఇక వుండబట్టలేకపోయాడు. ''ఏంటీ, పెద్ద సీరియస్ నెస్సు? ఏమైందివాళ మీకు? ఎవరిమీద కోపం?''

ముసలాయన గడియారం వంక చూస్తూనే, దొంగ నిట్టూర్పొకటి విడిచి, బదులిచ్చాడు. ''మాకెవరిమీద కోపం వుంటుందిరా? అయినా మాకోపంతో ఎవరికి నిమిత్తం? పేషెంట్‌కి నయమైపోయింది. మేల్‌నర్సు డ్యూటీ అయిపోయింది. ఇవాళ జీతం తీసుకుని చక్కా చెక్కేస్తున్నారు అయ్యగారు. మధ్యలో మాదేముంది?''

''ఏంటి, వెటకారమా?''ముసలాయన గడియారాన్ని

పరిశీలించడం మాన లేదు.

''అంటే ఈ నాలుగు నెలలూ నేనిక్కడ చేసింది డ్యూటీ అంటారు'' శేఖర్ గొంతు గంభీరంగా ఉంది.

ముసలాయన సెకన్ల ముల్లుపై దృష్టి కేంద్రీకరించాడు.

''అయితే నేనో నర్సుని, అంతేనన్నమాట'' కాస్త అసహనంగా, నర్సన్నమాట ఒత్తిపలుకుతూ అన్నాడు శేఖర్.

ఎట్టకేలకు తను ఆశించిన ఎఫెక్టు సాధించగలిగానని పించాక - తన అక్కసువెళ్ళగక్కేందుకు సరైన పునాది ఏర్పడిందని నిశ్చయమయ్యాక -ముసలాయన గడియారం మీంచి శేఖర్ వైపు తలతిప్పాడు; జారగిలబడ్డ వాడల్లా ముందుకు వంగి, ''ఆ మాట నేనేమీ అనలేదురా! నీ పద్ధతులలా వున్నాయి మరి. రేపెళ్ళిపోతున్నవాడివి, ముందో మాట నాకు చెప్పొద్దూ? మీ ఆంటీకి చెప్తే సరిపోతుందా? జీతం ఇచ్చేది ఆవిడ గనుకనా? అప్పుడు మరేమనుకోవాలి నన్నూ-నిన్నూ; పేషెంటూ-నర్సూ అనుకోక?'' తల పైకి తాటిస్తూ గొడవకొస్తున్న గొంతుతో అడిగాడు.

ఈ ఎదురుదాడి పూర్తయ్యాక శేఖర్ క్షణమాత్రం మౌనాన్ని అవలంబించాడు. తర్వాత అర్థం చేసుకున్నట్టు చిరునవ్వు నవ్వటం మొదలుపెట్టాడు. ఆ నవ్వు ముసలాయనకి నచ్చలేదు.

తర్జని ఆడిస్తూ, ''వీపు విమానం మోతెక్కిపోతుందొరే, అలా నవ్వావంటే'' అంటూ వెనక్కి జారగిలబడ్డాడు. కినుక మొహం పెట్టి చేతులు కట్టుకున్నాడు.

శేఖర్ అదే నవ్వు నవ్వుతూ పైకిలేచి నిల్చున్నాడు. ''పదండి, పార్కుదాకా నడిచొద్దాం'' అన్నాడు ఆసరాకి చేయందిస్తూ.

''నాకు ఓపికలేదురా ఇవాళ'' బెట్టు సడలుతున్న గొంతుతోనే అన్నాడు ముసలాయన.

''అలా కుదరదు! లేవాలి మరి, మళ్ళీ రేపు నేనుండను'' శేఖర్ పట్టుబట్టాడు.

ఇక పూర్తిగా సడలిపోయాడు ముసలాయన. ''ఇదో వెధవ బెదిరింపేమో మళ్ళీ మాకు'' అని గునుస్తూనే శేఖర్ చేయందుకుని మంచం దిగి నుంచున్నాడు.

❖ ❖ ❖

తర్వాత కారిడార్‌లోనూ, లిఫ్టులోనూ, అపార్ట్‌మెంటు గేటు దగ్గరనుండి పార్కు గేటు దాకానూ ఇద్దరూ ఈ విషయమ్మై కీచులాడుకుంటూనే వున్నారు; ''కోచింగ్ క్లాసులు పూర్తవగానే నేను ఊరెళ్ళిపోతానని మీకు తెలుసుకదా''ని శేఖరూ, ''నీ కోచింగ్ ఎప్పుడు పూర్తవు

## నాన్న...

తన అనుభవాన్ని
శ్రద్ధగా వినిపిస్తుంటే
అశ్రద్ధ చేసి ఆలకించక
కోల్పోయిందేమిటో
ఇప్పుడు అర్థమైంది.
తను వివరించిన
విలువైన విషయాలకు
ఏనాడు స్పందించక
ఎంత నష్టపోయానో
ఇప్పుడు తలచుకొని
చింతిస్తే లాభమేమి
తప్పుల్ని తెలుసుకొని
అజ్ఞానం నుండి బయటపడి
క్షమాభిక్షను అర్థించేసరికి
మహాభి నిష్క్రమణ జరిగిపోయింది
ఇప్పుడు పటానికి ప్రణమిల్లి
ప్రయాసపడితే ప్రయోజనమేమి
గొంతు చించుకొని గీపెట్టినా
గుండెబాదుకొని మొత్తుకున్నా
చితాభస్మాన్ని జల్లించి చూసినా
వ్యర్థపదార్థాల తప్ప
అసలు రూపం దొరకడంలేదు
ఈ అనంత విశ్వంలో
ఏ వస్తువులో లీనమైనాడో
ఏ రూపంలో మూర్తీభవించినాడో
అదొక అంతుచిక్కని అన్వేషణ
అతడు అజరామరుడు
తన జన్యుపరంపరతో
నాలో దాగిన సచ్చీలుడు

కనపర్తి రాజశేఖరమ్

# ఆనందతాండవం...!!

ఎండ పెరిగే కొద్దీ
మంచు కరుగుతుంది...!
వయసు పెరిగేకొద్దీ
బలం తగ్గిపోతుంది...!!
కాలం కానికాలంలో ఎన్నో...
అనూహ్య పరిణామాలు...!
ఇంకిపోతున్న జలవనరులు...
బీళ్ళుగా మారుతున్న భూములు
రైతన్నల గుండెలు బేజారు...!!
గిట్టుబాటు ధరలు లభించని..
ధాన్యరాశులు, పప్పుధాన్యాలు...!
అధిక ధరలతో బడుగు...
వర్గాల హాహాకారాలు...!
బిందెడు నీళ్ళకోసం...!
మహిళల వీధి పోరాటాలు...!!
అంతుపట్టని అబలల ఆక్రందనలు...
అవి... హృదయవిదారక దృశ్యాలు...!!
సమస్యల్ని పరిష్కరించలేని నాయకులు
పదవులకోసం అంతులేని ఆరాటాలు...!
అందుకే ప్రకృతి ఒక్కసారి కనికరిస్తే...
భారీ వర్షాలు, పొంగే జలధారలు...!
పచ్చనిపైరులతో పల్లెసీమలు కళకళ...
కర్షకుల హృదయాల్లో ఆనంద తరంగాలు...!!
కాలుష్య రహిత వాతావరణం.. అది
అందరి ఆరోగ్యానికి శుభసంకేతం...!
పుడమి తల్లి పరవశించినవేళ...
రాష్ట్రమంతా సశ్యశ్యామలం... సుభిక్షం...!
సుఖసంతోషాలే ప్రజల సుందర స్వప్నం...
ఆంధ్రుల జన జీవన ప్రస్థానం అప్రతిహతం...!
తెలుగు తల్లి హృదయంలో నర్తించే...
'ఆనందతాండవం' అనిర్వచనీయం...!!

తంగెళ్ళ పాండురంగశర్మ

తుందో నాకేం తెలుస''ని ముసలాయనా, ''తెలుసనుకున్నాన''ని శేఖరూ, ''అనుకోవడమేమి'' టంటూ ముసలాయనా వాదించుకుంటూనే వున్నారు. నిజానికి ఈ వాదులాట సగంలో వుండగానే ముసలాయనకి శేఖర్ తను వెళ్ళబోయే తేదీ ముందే చెప్పాడన్న సంగతి గుర్తొచ్చింది; అయితే, వెళ్ళిపోవాలనుకోవడమే శేఖర్ అసలు నేరంగా మనసులో ఓ రహస్య నిశ్చయాని కొచ్చేసిన ఆయన, హేతువుకు నిలబడని ఈ వాదాన్ని బయటపెట్టలేక, మొండిగా శేఖర్‌దే తప్పని బుకాయిస్తూనే వున్నాడు. చివరికి శేఖరే మెట్టు దిగి తనదే తప్పని ఒప్పుకున్నాడు. కాని అతనలా ఒప్పుకోగానే అర్థమైంది ముసలాయనకి, ఈ వాదనంతా ఎంత నిష్ఫలమో. ఎంత వాదించినా అతను వెళ్ళిపోతున్నాడన్న నిజం ఎలానూ వీగిపోదు.ఇది గుర్తు రాగానే, ఇదివరకట్లా రాగద్వేషాల్తో మలినంకాని, స్వచ్ఛమైన, సొంతమైన దిగులు ఆవరించుకుంది ఆయన్ని.

వాళ్ళు కూర్చున్న మునిసిపల్ పార్కు చిన్నదే.మధ్యలో నీళ్ళు రాని ఫౌంటెన్; దాని చుట్టూ విశాలంగా ఎత్తు పల్లాలతో ఆవరించుకున్న పచ్చిక బయలు;ఈ పచ్చికకు చుట్టూ అంచులాగా జాగర్స్ కోసం ఎర్రమట్టితో వేసిన బాట; ఆ బాట పక్కన క్రమం తప్పని విరామాల్లో సిమెంటు బెంచీలు; ఆ బెంచీల వెనకగా, బాట పైకి వంగి చూస్తూ, నిద్ర గన్నేరు, తురాయి, మోదుగ ఇత్యాది చెట్ల వరుసలు... పార్కు సందర్శకులు ఈ చెట్ల కాండాల మధ్య నుంచీ కనిపిస్తున్న ట్రాఫిక్‌ని, చెట్ల చిటారు కొమ్మల మీంచీ తొంగి చూస్తున్న కాంక్రీటు భవనాల్నీ నిర్లక్ష్యం చేయగలిగితే, స్వచ్ఛమైన ప్రకృతి మధ్య వున్న భ్రమని సాధించగలిగినట్లే. సూర్యుడు భవన సముదాయాల వెనక్కి వెళ్ళిపోవడంతో ప్రస్తుతం పార్కంతా నీడలోనే వుంది. పార్కులో జనం తగుమాత్రంగా వున్నారు.

సిమెంటు బెంచీలు అధిక భాగం జంటల్తో నిండి వున్నాయి. ఎదుట పచ్చిక బయల్లో కూడా కొందరు కూర్చున్నారు. కేరింతలు కొడుతున్న పసివాణ్ణే వాళ్ళ నాన్న మునివేళ్ళు పట్టుకుని ఫౌంటెన్ గట్టుమీద నడిపిస్తున్నాడు; వాళ్ళమ్మ పచ్చికలో కూర్చుని చప్పట్లు కొడుతూ ఉత్సాహపరుస్తోంది. జాగింగ్‌సూట్ వేసుకున్న ఓ నడి వయస్సు బట్టతలాయన బలమైన గ్రేహౌండ్‌ను గొలుసుతో అదుపు చేయలేకదాంతోపాటూ ఉరుకుతున్నాడు.

''ఫిట్‌నెస్‌మీద బాగా శ్రద్ధ వున్న కుక్కనుకుంటాను'' శేఖర్ ముసలాయన వైపు చూసి వ్యాఖ్యానించాడు. ముసలాయన ఆలోచననుండి తెప్పరిల్లి శేఖర్‌వైపు చూశాడు.

ఏమిటన్నట్టు తల ఎగరేశాడు. ఆయనకి వినపడేంత బిగ్గరగా చెప్పేసరికి ఎలాగూ అందులోని కాస్త హాస్యమూ చప్పబడిపోతుంది; కాబట్టి శేఖర్ ఏమీలేదన్నట్టు తల వూపాడు.

''అయితే మళ్ళీ పరీక్ష రాయడానికే వస్తావను కుంటా?'' అనడిగాడు ముసలాయన.

''రావలసిన అవసరం వుండదు. పరీక్ష సెంటర్ మా ఊరికి దగ్గర్లోనే ఇస్తారు'' శేఖర్ సమాధానమిచ్చాడు.

ముసలాయన తలపంకిస్తూ కిందికి చూశాడు. వాళ్ళిద్దరూ నిగ్రదగన్నేరు చెట్టు కిందవున్న ఓ సిమెంటు బెంచీమీద కూర్చున్నారు. గాలి కదిలినపుడల్లా కాసిని ఎండుటాకులు గింగిరాలు తిరుగుతూ రాలిపడు తున్నాయి. నేలమీదపడ్డ ఆకుల్ని ముసలాయన వూత కర్రతో సర్దుతున్నాడు. శేఖర్‌కి జాలేసింది. ''సెలక్టయితే మాత్రం ఉద్యోగం ఇక్కడే వేయించుకుంటాలెండి. దగ్గ ర్లోనే మకాం పెట్టేస్తాను. ముప్పొద్దులా నన్ను భరించక తప్పదు మీరు'' నవ్వుతూ అన్నాడు.

''అదంతా తేలేసరికి ఎంతకాలం పడుతుంది?'' ఎండుటాకులు సర్దుతూనే అడిగాడు ముసలాయన.

''ఎంత, సంవత్సరంలో అయిపోతుంది''

ముసలాయన ఓ పొడినవ్వు నవ్వి అన్నాడు, ''అప్పటి దాకా నేనుండొద్దురా?''

''మొదలెట్టారా మళ్ళీ'' శేఖర్ విసుగు నటించాడు.

''అదికాదురా, గత నెలగా పేపర్లో అబిట్యురీ పేజీలో ఒక్కడంటే ఒక్కడు ఎనభై దాటినవాడు కనపడలేదు. అందరూ అరవై, డెబ్భైల్లోపే. మరి నాకిప్పుడు ఎనభ య్యేడు.అసలు మొన్నటి దెబ్బకే పోవలసింది. ఆ పడింది పడింది... ఏ గచ్చుమీదనో, సింక్‌మీదనో పడి తలబద్దలు గొట్టుకోకుండా... సరాసరి టబ్ నీళ్ళల్లో పడబట్టి, ఇదిగో, ఇలా చావుతప్పి కాలు సొట్టపోయింది'' అంటూ ఊత కర్రతో ఎడమకాలి కట్టుమీద కొట్టుకున్నాడు.

''మీరు ముందా అబిట్యురీ పేజీల్ని ఫాలో అయ్యే వెధవలవాటు మానుకుంటే మంచిది''

''మీకు క్రికెట్ పేజీలెలాగో, మాకు అబిట్యురీ పేజీ అలాగరా. నీకు ఒరిగేదేం లేకపోయినా ఎవడెంత కొట్టాడో ఆసక్తిగా చూడవూ? ఇదీ అంతే''

''మీరు సెంచరీ కొట్టేస్తార్లెండి. ఆ విషయంలో ఏ దిగులూ పెట్టుకోకండి''

''అంత ఆశగాని, ఆసక్తిగానీ లేవురా. ఆ వచ్చేదేదో వచ్చేస్తే ఓ పనియిపోతుంది కదా, అన్నట్టుంది ప్రస్తుతం నాకు. రేపణ్ణించీ రోజులు తల్చుకుంటే...'' ఎలా పూర్తి చేయాలో తెలియక ఆగిపోయాడు.

ముసలాయన మాట్లాడబోయింది తన వెళ్ళిపోవడం గురించేనని శేఖర్‌కి తెలుసు. కాని తానిప్పుడు ఓదార్చే పాత్ర పోషిస్తే ఈ వియోగంపట్ల తనకే బాధలేదన్న భావన కలిగించినట్లవుతుంది. అందుకే నిశ్శబ్దంగా వుండి పోయాడు. ఆయనీ ప్రస్తావన తేకుండా వుంటే బాగుండే దనిపించింది.

ఫౌంటెన్ గట్టుమీద నిలబడ్డ పసివాడు. నాన్న తన చేయి వదిలేసి దూరంగా నిలబడటంతో, చేతులు గాల్లో చాచి పిడికిళ్ళు మూసి తెరుస్తూ ''దాదీ! దాదీ!'' అని పిలుస్తున్నాడు. పక్కబెంచీలో కూర్చున్న అమ్మాయి, ప్రియుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ఎదుట చక్కర్లు కొడుతూంటే, చేతులు కట్టుకు వెనక్కివాలి సాధికార పూర్వకమైన చిరునవ్వుతో పరిశీలిస్తోంది. ముసలాయనకి వెంటనే అర్థమైంది... రేపణ్ణించీ తానీ పార్కుకి రాడని, రాలేడని.

తామిద్దరితోనూ కలిసి ఎన్నో వేడుకైన సాయంత్రాల్లో మూగదైన మూడోభాగస్వామిగా పాలుపంచుకొందీ పార్కు. ఇకమీదట ఇక్కడికెప్పుడొచ్చినా దీని మూగతనం శేఖర్ లేని లేమిని గుర్తు చేస్తూనే వుంటుంది. పక్కకి చూశాడు. శేఖర్ బెంచీ వెనక్కి తలవాల్చి నిగ్రదగన్నేరు కొమ్మల్లోకి చూస్తున్నాడు. ఏదో గుండెల్లోంచి మొదలై గొంతుదాకా ఎగతన్నినట్టైంది ముసలాయనకి. ''ఏరా నన్ను గుర్తుంచుకుంటావా?'' అనడిగాడు. మరణానంత

## లోకంతీరు

అద్దాల మేడలో
రాతి గుండెల
నివాసం
మదిలో
కల్మశం
మాటల్లో అమృతం
కళ్ళకి గంతలు
అయినా...
అయిన వారికే
న్యాయం

ఎం.బలరాం

రం ఈ యువకుని జ్ఞాపకంలో మిగలడమొక్కటే తన పూర్తి అస్తిత్వానికి సార్థకత అనిపించింది ఆ క్షణాన.

శేఖర్ ఇబ్బందిగా నవ్వి ముందుకు వాలాడు. ''అలా మాట్లాడకండి''

''కాదు, చెప్పు''

''ఎందుకు మర్చిపోతాను!''

''మరి చచ్చిపోయినపుడు తప్పకుండా వచ్చిపోవాలి ఓసారి''

''ఇదిగో! మళ్ళీ చెప్తున్నా...''

''అదికాదురా... నాకు చాలామంది ఫ్రెండ్స్ వుండే వారు. కాని దాదాపు అందరూ చచ్చిపోయారు. నేను ఈ భూమ్మీద వదిలిపోతున్న ఫ్రెండువి నువ్వొక్కడివే. అందుకే, నన్ను గుర్తుంచుకో. చెప్పాలనుకున్నది చెప్తేస్తున్నా... ఈ నాలుగు నెలలూ నాకు గుర్తుంటాయి. బతికిన కొన్నాళ్ళయినా అర్థమయిందా''

''సరే''

''మంచి ఉద్యోగం సంపాదించు. అంతకన్నా ముఖ్యంగా , నువ్వంటే ప్రాణంపెట్టే వాళ్ళని నీ చుట్టూ కూడబెట్టుకో. అదే నువ్వు బతికిసాధించగలిగింది. అర్థమైందా!''

''ఊఁ'' శేఖర్ పరాకుగా ఒక అరచేతి రేఖలమీద మరో చేతి చూపుడువేలితో జాడలు తీస్తున్నాడు.

ముసలాయన గట్టిగా నిశ్వసించి, ''వెళ్దామా, ఇక చీకటి పడుతోంది'' అని పైకి లేచాడు.

శేఖర్ లేచాడు. ముసలాయన అలవాటు ప్రకారం శేఖర్ భుజం చుట్టూ ఓ చేయి వేసి మరో చేత్తో వూతకర్ర పట్టుకుని నడవసాగాడు. ఇదే చివరి స్పర్శ అన్న ఎరుకతో కాబోలు, వేలిముద్రలు దిగిపోతాయేమోనన్నంత బలంగా శేఖర్ భుజాన్ని ఒడిసిపట్టుకున్నాడు. గేటు దాకా ఇద్దరూ ఏమీ మాట్లాడుకోలేదు. దారిలో గ్రేహౌండ్, దాని బట్టతల యజమాని రెండో రౌండ్ కొడుతూ వాళ్ళకు ఎదురొచ్చారు. ప్రవేశం దగ్గర ఇనుప రివాల్వింగ్ గేటును తిప్పుకుంటూ వస్తున్న ఇద్దరు యువకులు ఏదో జోక్ చెప్పుకుని, ఒకరి చేతిమీద మరొకరు చప్పట్లు చరుచుకుంటూ పగలబడి నవ్వుకున్నారు. గేటు గుండా ముందు శేఖర్ వెళ్ళి ముసలాయనకు చేతిసాయం అందించాడు.

రోజులాగే శేఖర్ ముసలాయన్ని ఫ్లాట్ దాకా దిగబెట్టేందుకు రోడ్డు దాటించబోతుంటే, ఆయన అలా వీల్లేదన్నాడు. శేఖర్‌ని ఇక్కణ్ణించే సాగనంపి తనొక్కణ్ణే ఇంటికి వెళ్ళిపోతానన్నాడు. శేఖర్ కాసేపు వాదించి, చివరకు ముసలాయన మొండిపట్టు పట్టడంతో ఒప్పుకున్నాడు. ఆటో మాట్లాడటం పూర్తయ్యాక, జాగ్రత్తగా వుండమనీ, బాత్రూం కెళ్ళేటపుడు తలుపు గెడవేసుకోవద్దనీ, తాను వారానికోసారి ఫోన్ చేస్తుంటాననీ చెప్పి ఎక్కి కూర్చున్నాడు శేఖర్. ఆటో మలుపు తిరిగే వరకూ ఫుట్‌పాత్‌మీద నుంచున్న ముసలాయనకి చేయి ఊపుతూనే వున్నాడు.

❖ ❖ ❖

ఏదో నేలనపడ్డ చప్పుడైతే కూతురు చిప్స్ తరగడం ఆపి వంటగదిలోంచి బయటకు వచ్చింది. ముసలాయన తలుపు దగ్గర శిలలా నిలబడి వున్నాడు. వూతకర్ర నేల మీద పడివుంది. ఆమెకు కంగారేసింది. ''ఏంటి నాన్నా! ఏమైందీ? శేఖర్ ఏడీ?'' అంటూ గబగబా దగ్గరకు వచ్చింది. ముసలాయన కలలోంచి తేరుకున్నట్టూ ఆమె వైపు చూశాడు. ఆయన కళ్ళల్లో చెమ్మ తళుక్కుమంది.

''ఏమైంది నాన్నా? ఒక్కడివే వచ్చేవేం?'' భుజంమీద చేయివేసి గాభరాగా అడిగింది.

''నేనే అట్నుంచీ వెళ్ళిపొమ్మన్నాను'' పూడుకుపోతున్న గొంతుని పెగుల్చుకుని చెప్పగలిగాడు.

ఆమెకి అర్థమైంది. ఆయనపై ప్రేమ వెల్లువెత్తింది. ఆయన్ని దగ్గరకు తీసుకుని, సందిట్లో తల ఆన్చి, వీపు రుద్దుతూ, ''ఏంటిది నాన్నా పిచ్చికాకపోతే... నేనున్నాను కదా. మనిద్దరం వున్నాం. కదా, ఒకరినొకరు'' అని అనునయించింది.

ఇప్పుడు ఓదారుస్తోంది తనొకప్పుడు మోకాళ్ళమీద బోర్లా పడుకోబెట్టుకుని లాలపోసిన పాపాయి కాకపోతే, ఆయన గట్టుతెంచుకుని భోరుమని ప్రవహించేసేవాడే. అహం అడ్డొచ్చింది. ''ఊరుకోమ్మా, నువ్వు మరీ హడావిడి చేస్తావ్!'' అని ఆమెను విలించుకుని నెమ్మదిగా కుంటుతూ పడగ్గదివైపు నడిచాడు. ■

## యజమాని

వెన్నుదట్టే చెయ్యి
కళ్ళు తుడిచే చెయ్యి
కడుపు నింపే చెయ్యి
కష్టంలో ఆదుకునే చెయ్యి
కలవాడే అసలైన యజమాని

ఆకెళ్ళ వెంకట సుబ్బలక్ష్మి